క్లుప్తంగా

నేడు దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు నూతనంగా ప్రకటించిన రూ.4,016 పింఛన్ పంపిణీని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ బాలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని విజిలెన్సు అవగాహన వారోత్సవాల పోస్టర్లను సింగరేణి అధికారులు గురువారం ఆవిష్కరించారు. జీఎం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నవంబర్ 15 వరకు విజిలెన్సు అవగాహన వారోత్సవాలు నిర్వహించాల్సిందిగా సెంట్రల్ విజిలెన్సు విభాగం ఉత్తర్వులు జారీ చేసిందని ఇన్‌చార్జ్ జీఎం పంజాల శ్రీనివాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రభాకర్‌రావు, మల్లయ్య, గిరిధర్‌రావు, మోహన్‌రావు, బాలాజీనాయుడు, మహేష్, చిన్ని ప్రసాద్ పాల్గొన్నారు.

రైతువేదికలో మోటారు చోరీ

సుజాతనగర్: స్థానిక రైతు వేదికలో విద్యుత్ మోటారు చోరీ అయిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు ఏఈఓ శరత్ తెలిపిన వివరాల ప్రకారం.. రైతు వేదికలో పనిచేస్తున్న సిబ్బంది మొక్కలకు నీళ్లు పట్టాలని స్విచ్ ఆన్ చేయగా నీళ్లు రాలేదు. దీంతో మోటారు వద్దకు వెళ్లిచూడగా గుర్తు తెలియని వ్యక్తులు మోటారును చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ఏఈఓ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి కొత్తగూడెం బర్మాక్యాంప్‌నకు చెందిన గోవర్ధన్, కరుణలు రూ.5116, మంగళూరుకు చెందిన సేనపతి, వెంకటేశ్వరరావు, స్వాతిబిందులు రూ.5116 విరాళాలు అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి గురువారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్త దంపతులకు అమ్మవారి శేష వస్త్రప్రసాదాలను అందజేశారు.

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కంపెనీ బాధ్యులు

టేకులపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోరమండల్ ఇంటర్నేషనల్ మన గ్రోమోర్ సెంటర్ సమకూర్చిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. కోరమండల్ కంపెనీ బాధ్యులు నికుంజ సాహు, శ్రీనివాసరెడ్డి ఈ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్లాంట్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ హరికిషన్, హెచ్‌ఎం భద్రు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సోషల్ మీడియా వార్

ఇల్లెందు: ఇల్లెందులో ప్రజాప్రతినిధుల నడుమ సోషల్ మీడియాలో దూషణల పర్వం సాగుతోంది. ఇటీవల మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై మాజీ కౌన్సిలర్ ఎర్రబెల్లి కిష్టయ్య వాయిస్ రికార్డు పోస్ట్ చేశాడు. దీంతో చైర్మన్ వాట్సాప్ కాల్ ద్వారా కిష్టయ్యతో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఈ సంభాషణను కిష్టయ్య రికార్డు చేసి, తనను చైర్మన్ దూషించాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

శిలాఫలకాలు తీర్చిదిద్దడమే అభివృద్ధా?

కొత్తగూడెంఅర్బన్: అభివృద్ధి అంటే అందంగా శిలాఫలకాలను తీర్చిదిద్ది ప్రారంభోత్సవాలు చేయడం కాదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఇప్పటి వరకు శంకుస్థాపనలు చేసిన పనులు ఎన్ని పూర్తయినవి అనే విషయంపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. పాల్వంచ బస్టాండ్‌లో మరమ్మతుల కోసం మంత్రి పువ్వాడ చేతుల మీదుగా శంకుస్థాపన చేసి 8 నెలలు గడిచిన నేటికి పనులు ప్రారంభించలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్‌రావు, జిల్లా సంయుక్త కార్యదర్శి చెనిగారపు నిరంజన్‌కుమార్, అల్లకొండ శరత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరికే అనుమతులు కరువు!

శ్రీనివాసగిరి(గుట్ట)పైకి రోడ్డు నిర్మాణంపై నీలినీడలు
- అటవీ అనుమతులు వస్తేనే పనులు
- కాకతీయుల కాలం నాటి ఆలయంగా ప్రత్యేకత
- రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రాక



శ్రీనివాస గిరి వెంకటేశ్వర స్వామి ఆలయం గుట్ట

పాల్వంచ: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతుంది పాల్వంచలోని శ్రీనివాస గిరి(గుట్ట)పై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం. ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులు నిత్యం వస్తుంటారు. అయితే, గుట్టపైకి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేక, భక్తులకు స్వామి దర్శన భాగ్యం లభించడం లేదు. భక్తుల సౌకర్యార్థం రోడ్డు నిర్మాణం కోసం గతేడాది అధికారులు ప్రతిపాదనలు చేసారు. రూ.11 కోట్లతో గుట్టపైకి రెండు కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం చేసేలా ప్రణాళికలు రూపొందించారు. కానీ అటవీ ఫారెస్ట్ అనుమతులు రాకపోవడంతో అడుగు ముందుకు పడటం లేదు. దీంతో భక్తులకు ఇబ్బందులు తీరడం లేదు.

ప్రాచీన చరిత్రకు ఆనవాళ్లు..

ఎత్తయిన కొండపై ఉన్న ఈ ఆలయం భక్తులను ఆకర్షిస్తోంది. కొండపై ఆదిశేషుని పడగల రూపంలో ఏర్పడిన ఏకశిలా బిలంలో శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులను అనుగ్రహిస్తున్నట్లు ఉంటుంది. తెలంగాణ తిరుపతిగా పేరున్న ఈ కాకతీయుల కాలం నాటి ఈ దేవాలయం ప్రత్యేకతను సంతరించుకుంది. 1,500 మెట్లపై నడిచి వెళ్తే 600 ఎత్తులో ఉన్న గుహలో స్వామి వారు వేంచేసి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఏటా శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలను మూడు రోజుల పాటు ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. శ్రీనివాసగిరి అభివృద్ధికి 2017లో ఆలయ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. అప్పటి నుండి దాతల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతుంది. స్వామి వారిని దర్శించుకు కోవాలంటే పదిహేను వందల అడుగుల కాలిబాట దూరం, ఆరు వందల అడుగుల ఎత్తులో కలిగిన ఈ గుహకు చేరుకోవడం నాడు చాలా కష్టంగా ఉండేది. కమిటీ ఆధ్వర్యంలో కాలక్రమంలో రాళ్లను చెక్కి మెట్లుగా మలిచారు.

అటవీ శాఖ అనుమతి రాక ఇబ్బందులు..

గుట్టపైకి వెళ్లేందుకు రోడ్డు మార్గం అవసరమని గుర్తించిన ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రత్యేక కృషి చేశారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే కాక ఫారెస్ట్ శాఖ ఉన్నత అధికారులు, మంత్రులను కలిశారు. ఈక్రమంలోనే ఫారెస్ట్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు సంయుక్తంగా గత ఏడాది గుట్టపైకి రెండు కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానిని సర్వే చేశారు. ఇందుకోసం రూ.11 కోట్ల నిధులు అవసరమని గుర్తించారు. అటవీ శాఖ అనుమతి ఇస్తే అక్కడ భూమికి బదులుగా రెవెన్యూ శాఖ మరో చోట ఐదెకరాల స్థలం ఇచ్చేందుకు సుముఖంగా ఉంది. అయినా అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు సైతం రోడ్డుకు టెండర్లు పిలవలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించాల్సిన అవసరం ఉందని భక్తులు వేడుకుంటున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజర్ అనిల్ కుమార్‌ను వివరణ కోరగా గుట్టపైకి రోడ్డు నిర్మాణానికి సర్వే నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించామని తెలిపారు. అక్కడి నుంచి అనుమతులు రావాల్సి ఉందని వెల్లడించారు.



గుట్టపైకి భక్తులు వెళ్లేందుకు ఉన్న మెట్ల మార్గం

ప్రతిపాదనలు పంపించాం



రోడ్డు నిర్మాణానికి గతంలోనే రెవెన్యూ, అటవీ ఆర్‌అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో సర్వే చేసి రోడ్డు కోసం ప్రణాళిక రూపొందించాం. రూ.11 కోట్లతో ప్రతిపాదనలు సైతం సిద్ధమయ్యాయి. అయితే, అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో టెండర్లకు వెళ్లడం లేదు.

– వంశీ, ఏఈ, ఆర్‌అండ్‌బీ

అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న సంకల్ప్ అమోన్కర్

పాల్వంచరూరల్: తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని గోవా ఎమ్మెల్యే సంకల్ప్ అమోన్కర్ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అంతమొందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు స్థానిక సమస్యలపై పోరాటాలు చేయాలని, పోలింగ్ బూత్‌స్థాయిలో జరగాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్లపల్లి శ్రీనివాసకుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చింతలచెరువు శ్రీనివాసరావు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు ఆకుల నాగేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేంద్రబాబు, రంజిత్, అలువాల సందీప్, శివ, నరేష్, నర్సీదాస్, నరేష్‌లు పాల్గొన్నారు.

తాళ్లూరిని కలిసిన ఎమ్మెల్సీ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌లోని తాళ్లూరి వెంకటేశ్వరరావును ఆయన నివాసంలో గురువారం ఎమ్మెల్సీ తాత మధుసూదన్ కలిసి మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు, తన ఉద్యమ సహచరుడిని తన దగ్గరికి తీసుకురావాల్సిందిగా సీఎం చెప్పారన్నారు. రెండు, మూడు రోజుల్లో సీఎంతో వెంకటేశ్వరరావు భేటీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లగడపటి రమేష్, సాంబశివరావు, కాటంరాజు రవి, విజయ్‌కుమార్, బత్తుల సురేష్, నేర్ల రమేష్, శ్రీనివాస్, మల్లెల రవిచంద్ర, సంతోష్‌గౌడ్, ఎంపీటీసీ ధరాబాబు, గుంపెన సొసైటీ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, నాయకులు మేడ మోహన్‌రావు, సత్తిబాబు, పవన్‌బాబులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి విద్యార్థుల వినతి..



వినతిపత్రం అందజేస్తున్న విదార్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం వచ్చిన ఎమ్మెల్సీ తాత మధుకు కెఎస్‌ఎం కళాశాల విద్యార్థులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధి నుంచి కాకతీయ యూనివర్శిటీ పరిధిలోనికి కళాశాల వచ్చినా, అభివృద్ధి జరుగలేదని, అత్యవసర పరిస్థితులలో ఆస్పత్రికి వెళ్లడానికి అంబులెన్స్, ఇతర వాహనాలు అందుబాటులో లేవన్నారు. కళాశాలను అభివృద్ధి చేస్తానని సీఎం వాగ్దానం చేసి మరిచారన్నారు.

కొనసాగుతున్న ఆన్‌లైన్

సుజాతనగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోంది. మండల వ్యాప్తంగా గృహలక్ష్మీ కోసం 2,800 దరఖాస్తులు అందగా అర్హులని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ మేరకు అర్హుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

టేకులపల్లి: నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఉద్యోగులు కోరారు. ఈ మేరకు గురువారం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సులానగర్ పీహెచ్‌సీ ఆవరణలో నల్లరిబ్బన్లతో నిరసనను వ్యక్తం చేశారు. స్టాఫ్‌నర్స్ సునీత, కళమ్మ కాంటిజెంటల్ పనివాళ్ళు పద్మ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని రొంపేడు పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న స్కీం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్స్ అరుణకుమారి, డీఈవో వెంకట్ మాట్లాడుతూ.. ఈనెల 30 వరకు నిరసన తెలుపుతూ విధులకు హాజరవుతామని, 31న కలెక్టరేట్ వద్ద నిరసనతో సమ్మె ప్రారంభిస్తామన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఖాళీలు భర్తీ చేయాలి

సుజాతనగర్: సుజాతనగర్ ప్రభుత్వాస్పత్రిలో ఖాళీలను భర్తీ చేసి, 24 గంటల వైద్య సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కమిటీ ఆధ్వర్యంలో వైద్యురాలికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు, కొండే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

27న గద్దర్ సంస్మరణ సభ

ఇల్లెందురూరల్: ఈ నెల 27న టేకులపల్లి మండల కేంద్రంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక గద్దర్, ప్రజాస్వామిక వాది జహీర్ అలీ ఖాన్ సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కార్యదర్శి రడం శ్రీను తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఈ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'డీ' బ్లాక్ నుంచి బొగ్గు లోడింగ్ ప్రారంభం



బొగ్గుతో బయలుదేరుతున్న లారీలు

ఇల్లెందు: సింగరేణి సంస్థ పరిధి ఇల్లెందు ఏరియాలోని జేకే–5 ఓసీ డీ బ్లాక్ వద్ద లోడింగ్, అన్‌లోడింగ్ గురువారం ప్రారంభమైంది. కొంత కాలంగా ఇక్కడ ప్రక్రియ నిలిచిపోవడంతో లారీ యజమానులు తీవ్ర ఇబ్బంది పడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. దీంతో జీఎం జాన్ ఆనంద్ స్పందించి బొగ్గు రవాణా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా డీ బ్లాక్ వద్ద బీపీఎల్‌కు వెళ్లే లారీలకు లోడింగ్ ప్రారంభించారు. కాగా, ఈనెల 30న వేలం పూర్తికాగానే బాడీ లారీలకు కూడా బొగ్గు ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారు. ఈమేరకు లోడింగ్ ప్రారంభించడంపై నాయకులు యాకూబ్‌షావలీ, దుర్గారావు, వీరస్వామి, నాగుల్‌బాషా, కృష్ణ, లక్ష్మణ్, ప్రభాకర్, యాకూబ్‌పాషా తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం పంచాయతీ పరిధిలో పలు పార్టీల నుంచి 12 కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరాయి. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గడిచిన తొమ్మిదేళ్ళుగా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే ప్రజలను బీఆర్‌ఎస్ దరికి చేరుస్తున్నాయన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, వైఎస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్‌కుమార్, పాచరేలే ఆజ్మీర కవిత, మల్సూర్, లష్కర్, కోటి, నండూరి రామాచారి, రాము, శ్రీనివాసచారి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జేకే ఓసీని సందర్శించిన జీఎం

ఇల్లెందు: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలోని జేకే ఓసీని కొత్తగూడెం రీజియన్ జీఎం(సేఫ్టీ) జి.కుమారస్వామి గురువారం పరిశీలించారు. ఓసీలోని క్వారీలు, ఓబీ పనులు, బ్లాస్టింగ్ పనులను తనిఖీ చేశాక అధికారులతో సమీక్షించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి జరపాలని, విధుల్లో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పంజాల శ్రీనివాస్, పీఓ వెంకటేశ్వర్లుతో పాటు పూర్ణచందర్, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, కిషన్, పవన్‌కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎంఓకు సన్మానం

ఇల్లెందు: సింగరేణి సంస్థ కొత్తగూడెం హాస్పిటల్‌లో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పని చేసి ఈ నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్న చీఫ్ మెడికల్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరావును ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఘనంగా సత్కరించారు. సింగరేణిలో వివిధ హోదాల్లో పని చేసిన ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రభాకర్‌రావు, మల్లారపు మల్లయ్య, శ్రీనివాసు, గిరిధర్‌రావు, జీవీ మోహన్‌రావు, డాక్టర్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

పాల్వంచ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు నిర్వహించనున్న ఈనెల 21 నుంచి 27 వరకు ప్రచార ఆందోళనలు, 29న చలో హైదరాబాద్ కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక పాల్వంచలో ఈ మేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు విస్మరించారని, జీవన ప్రమాణాలు సన్నగిల్లిపోయాయన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరమల్ల మల్లయ్య, అఫ్జల్ ఖాన్, రాములు, సుధీర్, శ్రీనివాస్, ఈశ్వరయ్య, సుధీర్, లక్ష్మీ, మంగమ్మ పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్ని అవకాశాలు పొందాలి



మాట్లాడుతున్న సైదులు

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగ విద్యార్థులందరూ సాధారణ విద్యార్థులతో సమానంగా అన్నీ అవకాశాలను పొందాలని, అందుకు రిసోర్స్ పర్సన్‌లు నిరంతరం కృషి చేయాలని జిల్లా సమ్మిళిత విద్యా కో ఆర్డినేటర్ కె.సైదులు తెలిపారు. గురువారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆనందఖనిలో సమ్మిళిత విద్యా రిసోర్స్ పర్సన్ల జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన నైపుణ్యాలతో పాటు, దివ్యాంగ పిల్లలకు ట్రాన్స్‌పోర్టు అలవెన్స్, ఎస్కార్ట్ ఎలివేన్స్, రీడర్ అలవెన్స్, ప్రత్యేక ఉపకార వేతనాలు వంటి అనేక రకాల పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ప్రతీ విద్యార్థికి చేరే విధంగా తల్లిదండ్రులను చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ సతీష్‌కుమార్, డాక్టర్ వీరబాబు, ప్రధానోపాధ్యాయులు షకీలా, టెక్నికల్ పర్సన్ మోహన్, సమ్మిళిత విద్యా రిసోర్స్‌పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం



ప్రచారం చేస్తున్న కోరం కనకయ్య

ఇల్లెందు: పేద ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యమని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తెలిపారు. పట్టణంలోని 6, 11వ వార్డుల్లో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టనున్న పథకాలను వివరించి మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వడంతో పాటు పింఛన్ పెంచుతామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని తెలిపారు. నాయకులు, ప్రజాప్రతినిధులుడానియేల్, లింగాల జగన్నాథం, బోగ నందకిషోర్, ఇమామ్, జీ.వీ.భద్రం, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, స్వాతి, చుక్కమ్మ, మండల రాము, పూనెం సురేందర్, ముక్తి కృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదవ్వాలి



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ఎస్‌డీసీ కాశయ్య

ఇల్లెందురూరల్: అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటర్లుగా నమోదవ్వాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి కాశయ్య సూచించారు. నూతన ఓటర్ల నమోదు ప్రక్రియపై తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రాజకీయ పక్షాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సెప్టెంబర్ 19 వరకు బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారన్నారు. గ్రామాల్లో అర్హులైన యువతకు చైతన్యం కల్పించి ఓటర్లుగా నమోదయ్యేలా రాజకీయ పక్షాలు సహకరించాలన్నారు. వీటితోపాటు ఓటరుగా మండలం, పోలింగ్ కేంద్రం మార్పు వంటి విషయాలలోనూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రవికుమార్, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరగనున్నదని తహసీల్దార్ శారద తెలిపారు. గురువారం స్థానిక తహసీల్‌లో జరిగిన బూత్ స్థాయి అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ తిరుపతిరావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



జూలూరుపాడు: మాట్లాడుతున్న తహసీల్దార్ శారద

మంత్రి పువ్వాడకు రెండో ఏఎన్‌ఎంల వినతి



ప్రతులను దహనం చేస్తున్న ఏఎన్‌ఎంలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రెండో ఏఎన్‌ఎంల క్రమబద్ధీకరణ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు గురువారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగ నియామక ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా సందర్శించి డిమాండ్లను పరిష్కరించి సమ్మెను నివారించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, కౌన్సిలర్ మునిగడప పద్మ, ఎండి.సజ్జు భేగం, ప్రియాంక, కౌసల్య, అరుణ, రాములమ్మ, పార్వతి, పుష్ప, బాలనాగమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ఎస్అండ్‌పీసీ' ఎన్నికలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం కార్పొరేటర్ ఏరియా పరిధిలోని ఎస్అండ్‌పీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో టీబీజీకేఎస్, బీఎంఎస్, ఎస్సీ, ఎస్టీ అసోషియేషన్ ఒక ప్యానెల్‌గా, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ మరో ప్యానల్‌గా బరిలోకి దిగాయి. కాగా టీబీజీకేఎస్, బీఎంఎస్, ఎస్సీ ఎస్టీ అసోషియేషన్ ప్యానెల్ విజయం సాధించింది.

పరిశుభ్రత పాటించాలి

ఇల్లెందురూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యాలను కాపాడుకోవాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత సూచించారు. మండలంలోని వేపలగడ్డ గ్రామంలో గురువారం కొమరారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం నిజాంపేట గ్రామంలో సబ్‌సెంటర్‌ను తనిఖీ చేశారు.

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.డాక్టర్ శ్రీదేవి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితం మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఆర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ శంఖారావాన్ని జయప్రదం చేయండి

జూలూరుపాడు: సెప్టెంబర్ 3న హైదరాబాద్ ఎల్బీనగర్ సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాజకీయ పద్మశాలి శంఖారావంను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షుడు మాచర్ల రామందర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడులో పద్మశాలి సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వల్లల రాజలింగం, జిల్లా కార్యదర్శి గురిలింగం, రాష్ట్ర ప్రచార కార్యదర్శి తుమ్మ నరసింహారావు, మండల అధ్యక్షుడు సొబ్బని సూర్యం, ఎస్ శ్రీను, బోగ నరసింహారావు, దొంతుల సత్యనారాయణ, నాగేశ్వరరావు, కోటి, సొబ్బని భాస్కర్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయికులు

టేకులపల్లి: ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ డిమాండ్ చేశారు. గురువారం సులానగర్ పీహెచ్‌సీలో వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. పీవైఎల్ మండల అధ్యక్ష కార్యదర్శులు భూక్యా లక్ష్మణ్, తోటకూరి సతీష్, లచ్చు, కిషన్, రామ, గవాస్కర్ పాల్గొన్నారు.

చంద్రయాన్–3 దేశానికే గర్వకారణం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇల్లెందు: చంద్రుని దక్షిణధ్రువంపై చంద్రయాన్ –3 విజయవంతంగా ల్యాండ్ కావటం హర్షించదగిన విషయమని, ఈ పరిణామం దేశానికి గర్వకారణమని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మార్గదర్శి విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలోని భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. భారీ మువ్వన్నెల పతాకాన్ని ప్రదర్శించారు. మువ్వన్నెల జెండాలను ప్రదర్శిస్తూ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ పొడువునా మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శిని డైరెక్టర్స్ అర్వపల్లి రాధాకృష్ణ, యాదగిరి రాంబాబు, మాదినేని శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రాంబాబు, దామోదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.